# స్వర్ణ భారత జ్యోతి
తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ | సంపాదకులు : చెరుకు జగన్ గౌడ్ | సంపుటి : 04 సంచిక : 291 | బుధవారం- 28 జనవరి -2026 | పేజీలు : 4 | వెల : 5/-



రిపోర్టర్స్ కావలెను
పత్రికా రంగంలో అనుభవం కలిగిన రిపోర్టర్లు జిల్లా, నియోజకవర్గ ఇన్చార్జిలుగా, మండల రిపోర్టర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతమైన యువకులకు కావలెను.
ఫోన్ నెంబర్ : 966282126


# మోగిన తెలంగాణ మున్సిపల్ నగారా

- ఫిబ్రవరి 11న పోలింగ్... 12 అవసరమైతే రీపోలింగ్
- ఫిబ్రవరి 13న కౌంటింగ్ .. అదేరోజు ఫలితం వెల్లడి
- 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎంపిక
- నేటినుంచే నామినేషన్ల స్వీకరణ.. 30 వరకు గడువు
- 31న నామినేషన్ల పరిశీలన...ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణ
- వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- షెడ్యూల్ ప్రకటించిన కమిషనర్ రాణి కుముదిని

హైదరాబాద్, జనవరి 27 : తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల ప్రక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఈసీ రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ మేరకు 28 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంఅవుఉతంది. 30తో నామినేషన్ల స్వీకరణ గడవు ముగియనున్నది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం మిగతా 4లో..




# అక్రెడిటేషన్ల జీవోను సమూలంగా సవరించాలి



- ప్రెస్' స్టిక్కర్ నిబంధన తొలగించండి
- మంత్రి ని, స్పెషల్ కమీషనర్ ను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

హైదరాబాద్,జనవరి 27. స్వర్ణభారత జ్యోతి.: మీడియా అక్రెడిటేషన్ల జీవో 252ను సవరించడం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర సమాచార పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక లకు కృతజ్ఞతలు తెలిపారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, రాష్ట్ర కో-కన్వీనర్లు తన్నీరు శ్రీనివాస్, కుడుతాడు బాపురావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవి కుమార్, నాయకులు శ్రీధర్, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, సమాచార భవన్ లో కమీషనర్ ప్రియాంక ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవో 252 సవరణ సమూలంగా జరగలేదని, మరోసారి జీవోను పున: సమీక్షించి సవరించాలని వారు కోరారు. జీవోసవరణలో కేబుల్ చానల్స్, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు న్యాయం జరగడం లేదని, గతంలో కేబుల్ ఛానల్స్ కు ఐఅండ్ పీఆర్ ద్వారా 12 రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కార్డులు, నాలుగు జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేవారని, ఈ విషయాన్ని తాము పలు తమరి దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, సవరించిన జీవోలో కేబుల్ చానల్స్ అంశమే లేకపోవడం బాధాకరమని అన్నారు. యూనియన్ గా తమ అభిప్రాయాన్ని చెప్పినప్పటికీ కేబుల్ చానల్స్ విషయంలో, మిగతా 4లో..

# మున్సిపల్ ఎన్నికల హడావిడి

- పనిలోపనిగా అక్రమార్కుల ఇసుకదోపిడీ
- అధికారులు పట్టించుకోవడంలేదంటున్న ప్రజలు

నిజామాబాద్,జనవరి27 : భీమ్‌గల్ మండలంలో ఇసుక దందాకు అడ్డూ అదుపులేకుండా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. విడుతల వారీగా అడ్డాలు మారుస్తూ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. వీరికి నాయకులు, అధికార యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై గ్రామంలో కొందరు డయల్ 100 నంబర్‌కు ఫిర్యాదు చేయగా, పోలీసులు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు. మున్సిపల్ ఎన్నికల హడావుడిలో పార్టీలు, నాయకులు ఉండగా అక్రమార్కులు రహస్యంగా ఇసుకను తరలించడం చేస్తున్నారు. ఒక రోజు గ్యాప్ ఇచ్చి తిరిగి రాత్రి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయినా అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం గమనార్హం. ఇటీవల గ్రామంలో ఉన్న కప్పల వాగు నుంచి ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు స్థానిక గ్రామ కమిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం మూడు రోజుల క్రితం అర్ధరాత్రి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో వాగులోకి ప్రవేశించి ఇసుకను గ్రామ శివారులోని హైస్కూల్ పక్కన డంపు చేశారు.




అక్కడి నుంచి లారీలు, టారస్ బండ్లలో పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి వేళ అందినకాడికి దోచుకుపోతున్నారు. అధికారంలోకి వచ్చిందే ఆలస్యం మండలంలోని కప్పలవాగుపై నాయకులు దండయాత్ర చేస్తున్నారు. మండలంలో ఇసుక లభించే ప్రాంతాలు కనిపిస్తే చాలు తవ్వుకుంటున్నారు. మొన్నటి వరకు బడాభీమ్‌గల్, తర్వాత భీమ్‌గల్, అనంతరం సికింద్రాపూర్, తాజాగా బెజ్జోరా వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టిన అక్రమార్కులు ఇప్పుడు మండలంలోని గోన్‌గొప్పుల్ వాగులోకి ప్రవేశించారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీటి నిల్వలు తగ్గుతాయని అంటున్నారు. తంలో రెండు మూడు రోజులు పెద్ద మొత్తంలో ఇసుకను డంపులు చేసి ఒకేసారి లారీలు, టారస్ బండ్లలో పట్టణ ప్రాంతాలకు తరలించేవారు. భారీ ఇసుక డంపులతో ప్రజల కండ్లలోకి వస్తున్నామని భావించిన ఇసుకాసురులు, ఈ సారి కొత్త ఎత్తుగడ వేశారు. ముందుగానే నిర్ణయించిన స్థలంలో టారస్ బండ్లు, లారీలు సిద్ధంగా ఉంచి, వచ్చిన ఇసుకను వచ్చినట్లు జేసీబీ సాయంతో భారీ వాహనాల్లో నింపుతున్నారు. దీంతో తెల్లవారే సరికి ఖాళీ మైదానం దర్శనమిస్తుంది. ఎవరైనా దాడులు, తనిఖీలు చేసినా అక్కడ ఏమీ కనిపించకుండా ముందు జాగ్రత్త పడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో నాయకుల మద్దతుతోనే ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గ్రామాలకు ఆదాయం ఆశ చూపించి, వీడీసీల పేరుతో గ్రామస్తుల నోరు నొక్కేస్తున్నారు. ఇసుక దోపిడీని అరికట్టి, సహజ వనరులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# తాను చెబుతున్న మొదటి దెయ్యం అతనే

- అతనే గుంపు మేస్త్రీ రేవంత్‌కు గూఢచారి
- కెసిఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్
- మాజీ ఎంపి సంతోష్ రావుపై మండిపడ్డ కవిత

హైదరాబాద్,జనవరి27 : తాను చెప్పిన మొదటి దయ్యం సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది అతనేనని కవిత ఘాటుగా విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్ చేశారు.



సంతోష్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కేసీఆర్ దగ్గర ఉన్న మొదటి దెయ్యం సంతోష్ రావు' అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి ప్రధాన గూఢాచారి కూడా సంతోష్ రావేనని ఆరోపించారు. ఫాంహౌస్‌లో కేసీఆర్ ఫుల్ ఇడ్లీ తిన్నారా? సగం ఇడ్లీ తిన్నారా? అనే సమాచారాన్ని రేవంత్‌కు సంతోష్ చేరవేస్తాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు కవిత. మిగతా 4లో..

# రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలింపు కుదరదు

- మంత్రులతో మాట్లాడే వరకు నిర్ణయం తీసుకోవద్దు
- అధికారులను హెచ్చరించిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి



సంగారెడ్డి,జనవరి27 : సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మరో చోటికి తరలిస్తే ఊరుకోనని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా, పట్టణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మరో చోటికి మిగతా 2లో..

# రైతులకు అరకొర సాయం

- సకాలంలో చెల్లించని బోనస్
- ఆరు గ్యారెంటీలు... అసలు గ్యారెంటీలు పోయాయి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల

నిజామాబాద్,జనవరి27 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు గుప్పించి, ప్రజలను మోసం చేసిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు ప్రధానంగా పెట్టుబడి సాయం రూ.15వేలు, రైతుబీమా, రూ.2లక్షల్లోపు రుణమాఫీ, సకాలంలో ఎరువులు, విత్తనాలు, సాగుకు ఉచిత విద్యుత్, సాగు నీరు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు వంటివి అనేక హామీలను ఎగవేశారని అన్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులను ప్రోత్సహించేందుకు పంట ఉత్పత్తులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామంటూ పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికి మాటతప్పారని అన్నారు. ఆరు గ్యారెంటీలంటూ ఉన్న హామీలను కూడా పక్కన పెట్టారని అన్నారు. సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ వర్తింపజేస్తామని అధికారంలోకి వచ్చాక మాట మార్చారని మండిపడ్డారు. ఆ తర్వాత సన్న వడ్లకు మాత్రమే ఇస్తామంటూ బుకాయించారు. సన్న వడ్లకు సైతం క్వింటాకు రూ.500 బోనస్ సరిగా అమలు కావడం లేదన్నారు. గత యాసంగిలో ధాన్యం అమ్ముకున్న రైతులకు బోనస్ జమ కాలేదు. యాసంగి, వానాకాలం సీజన్‌లు ముగిసి యాసంగి వచ్చినప్పటికీ బోనస్ బకాయిలు చెల్లింపుపై ప్రభుత్వం అశ్రద్ధ చూపుతోందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు దిక్కూ మొక్కూ లేకుండా పోయిందన్నారు. కేసీఆర్ పరిపాలనలో ఠంచనుగా అమలైన రైతు అనుకూల పథకాలన్నీ అతీగతీ లేకుండా పోతున్నాయన్నారు. అరకొరగా బోనస్ వర్తింపజేసి చేతులు దులుపుకున్న ఘటనలు కళ్ల ముందే సాక్షాత్కారమై నిలుస్తుండగా కాంగ్రెస్ పాలకుల్లో మాత్రం బాధ్యత కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు డిక్లరేషన్‌లో పంటలకు బోనస్ కింద రూ.500 అందిస్తామని పేర్కొని సన్న వడ్లకు మాత్రమే పరిమితం చేసింది. ఇచ్చిన అబద్ధపు హామీని సైతం కాంగ్రెస్ పార్టీ సరైన రీతిలో అమలు చేయడం లేదని వేముల



అన్నారు. గడిచిన నాలుగు సీజన్‌లలో బోనస్ చెల్లించిన పరిస్థితులు అరకొరగానే ఉన్నాయి. రైతులంతా ఆశగా బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు. క్వింటా సన్న వడ్లకు రూ.500 చొప్పున బోనస్ వస్తే తమకు లాభం జరుగుతుందని సంబుర పడుతుంటే ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. అసంబద్ధమైన హామీలిచ్చి రైతులను ఆకర్షించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడేమో పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట మార్చుడంపై రైతులంతా మిగతా 4లో..

# వరంగల్ నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం

- టూ వీలర్‌ను వేగంగా ఢీకొన్న టిప్పర్
- ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న డాక్టర్ మృతి




వరంగల్,జనవరి27 : వరంగల్ నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న వైద్యురాలు మృతి చెందారు. మ్టటెవాడ ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చించోలి మండలం బత్తంపల్లికి చెందిన ఎస్.మమతారాణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. నగరంలోని హంటర్‌రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ రాఘవేంద్రతో ఆమెకు వివాహం జరిగింది. సోమవారం రాత్రి విధులు ముగించుకొని భర్తతో కలిసి హంటర్ రోడ్డు మీదుగా బైక్‌పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో ఏడు మోరీల కూడలి వద్దకు రాగానే వెనక నుంచివచ్చిన టిప్పర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు కింద పడిపోయారు. 9 నెలల గర్భిణిగా ఉన్న మమతా రాణి తీవ్రంగా గాయపడటంతో స్థానికుల సహాయంతో భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. టిప్పర్ డ్రైవర్ అన్సారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులుకేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రపంచ తెలుగు కవుల మహాసభలకు ఎంపికైన ఎంజియూ విద్యార్థి



నల్లగొండ భారత జ్యోతి 2026 ప్రపంచ తెలుగు కవుల మహాసభలకు మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు శాఖ లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కత్రావత్ గణేష్ ఎంపికయ్యారు. ఈ మహాసభలను ప్రపంచ తెలుగు కవుల సంఘం–ప్రపంచ తెలుగు కవుల వేదికఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతోంది. "మన ఊరు–మన చరిత్ర" అనే అంశంపైరాష్ట్రస్థాయిలో తృతీ య బహుమతి సాధించి ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారు. అచ్చం పేట గ్రామాలకు సంబంధించినతెలుగు సాహిత్య రచనల ఆధారంగాసమగ్రమైన పరిశీలన అనంతరంఈ మహాసభలకు అర్హులుగా ఎంపికైఆహ్వాన పత్రికలు అందుకున్నారు. ప్రపంచీకరణ, కంప్యూ టరీకరణ వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో మాతృభాష, సాహిత్యం, కళారూపాల ప్రాము ఖ్యతను చాటిచెప్పేలా, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా 21, 22 ఫిబ్రవరి 2026 తుమ్మలపల్లి కళాక్షేత్రం, విజయవాడ వేదికగా "ప్రపంచ తెలుగు కవుల మహాసభలు" ఘనంగా నిర్వహించబడనున్నాయి. అచ్చంపేట నుంచి ఈ ఘనత సాధించడం నిజంగా గర్వ కారణం గణేష్ పేర్కొన్నారు. విద్యార్థి ప్రతిభ పట్ల ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మారం వెంకట రమణారెడ్డి. ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ అంజిరెడ్డి. తెలుగు శాఖ ఉపాధ్యా యులు, విద్యార్థి సంఘాల నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## వైద్యం వికటించి మహిళ మృతి





- నల్లగొండ జిల్లాలో దారుణం
- వరుస ఘటనలతో భయపడుతున్న జిల్లా ప్రజలు

నల్లగొండ టౌన్ భారత జ్యోతి జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందింది. నేరేడు గుమ్మ మండలానికి చెందిన ఓ మహిళ గర్భసంచి తొలగింపుకై ఆస్పత్రిలో మూడు రోజుల క్రితం చేరారు. గర్భసంచి ఆపరేషన్ కొరకు వచ్చిన మహిళకు వేరే ఆపరేషన్ చేశారని బంధు వులు ఆరోపిస్తున్నారు. డాక్టర్ల నిర్లక్ష్యంతోనే మహిళా మృతి చెందిందని మృతురాలి బంధువులు హాస్పిటల్ యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. ఇటీవల కాలంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎనిమిదేళ్ల బాలుడు మృతి మరవక ముందే ఇలాంటి సంఘటన జరగడం జిల్లా ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. ఇలా వరుస సంఘటనలు జరుగుతున్న వైద్య అధికారులు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ముడుపులతో జిల్లా వైద్యశాఖఅధికారులు ఆసుపత్రుల వైపుచూడటం లేదుఅనిబహిరంగ రహస్యం అని పలువురు ఆరోపిస్తున్నారు.

## మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- రేపటి నుంచే నామినేషన్లు
- ఈనెల 30 వరకు నామినేషన్లు..31న స్క్రూటినీ
- ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్నాయి. 13న కౌంటింగ్

హైదరాబాద్ జనవరి 28 భారత జ్యోతి ప్రతినిధి : రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయి. రేపటి నుంచి ఈనెల 30 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 31న స్క్రూటినీ ఉంటుంది. ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్నాయి. 13న కౌంటింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడి కానున్నాయి. మొత్తంగా 52 లక్షల మంది ఓటర్లున్నారు..

## వంగ మధుసూదన్ రెడ్డి ఆకస్మిక మరణం చాలా బాధాకరం



- మంగళవారం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి .

ఎల్బీనగర్ జనవరి 28 భారత జ్యోతి. బీజేపీ సీనియర్ నాయకులు, చంపాపేట్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత విచారకరమని గౌరవ ఏమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడించారు. వంగ మధుసూదన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ అతని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో భగవంతుడు ధైర్యం, మనోబలాన్ని ప్రసాదించాలని కోరుకోవడం జరిగింది.

# రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరిస్తా

- ఎంపీ ఈటల రాజేందర్





ఎల్బీనగర్ డిసెంబర్ 28 భారత జ్యోతి.
దేశ జనాభాలో దాదాపు 85% కుటుంబాలతో రేషన్ డీలర్లకు నేరుగా పరిచయాలు ఉంటాయని అయినప్పటికీ డీలర్ల పట్ల ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హస్తినాపురం పరిధిలోని కేకే గార్డెన్ ఫంక్షన్ హాల్ లో డీలర్ల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు సామ రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు వన్ పల్లి శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 17 వేల రెండు వందల మంది రేషన్ డీలర్లు పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా రేషన్ డీలర్ల సమస్యలను తెలుసుకున్నానని వీటిని అంచలంచలుగా పరిష్కరిస్తానని ఈ సందర్భంగా ఎంపీ రేషన్ డీలర్లకు హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ డీలర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నా వంతు బాధ్యతగా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నైకోటి రాజు, కార్యదర్శి ఆవుల సంజీవరెడ్డి, కోశాధి కారి పారేపల్లి నాగరాజు, నందయ్య, అముర ఇంద్రసేనారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోకొండ వైకుంఠం, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పూస్తే శ్రీకాంత్, మురళీమోహన్, నూతనంగా ఎన్నికైన వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షునిగా చెట్టిగారి నరేందర్ రావు నియామకం..



రాజేంద్రనగర్, భారత జ్యోతి: ప్రతి బస్తీకి వెళ్లండి.. సమస్యలను తెలుసుకొండి.. వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసేలా చూడాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి కార్యకర్తలకు సూచించారు. అత్తాపూర్ సర్కిల్ హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షునిగా చెట్టిగారి నరేందర్ రావు ( చిన్న) ను నియమిస్తు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తీకరెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి.అర్చన జయప్రకాశ్ తో కలసి మాట్లాడారు. ఇప్పటి వరకు ఓటరు జాబితా లో తమ పేర్లు నమోదు చేయించుకోలేని వారి వివరాలు తెలుసుకుని వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయించాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పారిశుధ్య సమస్యలు, మంచి నీరు, విద్యా, వైద్యం, రవాణ, శాంతిభద్రతల లాంటి సమస్యలను తెలుసుకుని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపాలన్నారు. నెలకు ఒక సారైన డివిజన్ స్థాయిలో కార్యకర్తల సమావేశాలను నిర్వహించి కార్యకర్తల సాధక బాదకాలను తెలుసుకోవాలన్నారు. కార్యకర్తలకు అండగా ఉన్నప్పుడే వారు ఎన్నికల సమయంలో మనకు అం డగా ఉండి పని చేస్తారని గుర్తు చేశారు. విద్యావం తుడు, రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన చెట్టిగారి నరేందర్ రావు కు హైదర్ గూడ డివిజన్ పార్టీ బాధ్యతలను అప్పగించడం జరిగిందని, అందరిని కలుపుకుపోయి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి.కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడటానికి యువత సిద్ధంగా ఉండాలన్నారు. హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెట్టిగారి నరేందర్ రావు మాట్లాడుతూ, తన పై నమ్మకంతో మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, పి.కార్తీక్ రెడ్డిలు హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షునిగా నియమించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. అందరిని కలుపుకుపోయి పార్టీ ని వచ్చే ఏ ఎన్నికలలోనైన గెలిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మైలార్దేవుపల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్, సీనియర్ నాయకులు రావుల జంగయ్య, జాలిగం చిత్తారి, గుమ్మకొండ హన్మంత్ రెడ్డి , కొండమీది హరినాథ్, కె నర్సింగ్ రావు, పి.లక్ష్మణ్, ముఖేశ్, పి.జీవన్ దాస్, డి.రమేశ్ ముదిరాజ్, నోముల రాము యాదవ్, ఎడ్లకాడి సూర్యం, గుమ్మడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు
# పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధం

- రాష్ట్ర డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి స్పష్టం



హైదరాబాద్ : జనవరి 27 : భారత జ్యోతి ప్రతినిధి. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ శ్రీ బి.శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ మంగళవారం నాడు ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై డిజిపి మాట్లాడుతూ... ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. అక్రమ నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఉచితాల పంపిణీని అడ్డుకోవడానికి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్లను రంగంలోకి దించుతామన్నారు. 50 వేల రూపాయల కన్నా ఎక్కువ నగదును తీసుకు వెళుతున్నట్లయితే తగిన ఆధారాలు చూపించాలని, లైసెన్స్ కలిగిన ఆయుధాలన్నీ వెంటనే డిపాజిట్ చేయాలని, అక్రమ ఆయుధాల ఏరివేతకు ప్రత్యేక సోదాలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఇటీవల ముగిసిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా 1800 ఆయుధాలను ఆయా పోలీస్ స్టేషన్లో అప్పగించారని తెలిపారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించి ఆర్థిక పూచీకత్తుతో బైండోవర్ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో 24/7 పని చేసేలా ప్రత్యేక ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. 1000కి పైగా ఉన్న అతి సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజల్లో భరోసా కల్పించేందుకు సాయుధ బలగాలతో 'ఫ్లాగ్ మార్చ్' నిర్వహిస్తామని డీజీపీ ప్రకటించారు. రాష్ట్రంలో రెండో విడత సాధారణ పురపాలక ఎన్నికల కింద మొత్తం 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పోలింగ్ జరగనుందని డిజిపి వివరించారు. కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నిజామాబాద్, నల్గొండ, రామగుండం కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డులతో పాటు, 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రక్రియను అమలు చేసేందుకు స్థానిక పోలీసులకు అదనంగా తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ (టీజీఎస్పీ) మరియు ఇతర విభాగాల బలగాలను మోహరిస్తున్నట్లు డిజిపి తెలిపారు. పోలీస్ శాఖకు సంబంధించిన సిబ్బంది కాకుండా ఎక్సైజ్ , ఫారెస్ట్ శాఖలకు సంబంధించిన రెండు వేల మంది బందోబస్తు కోసం అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సహకారంతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద భౌతిక పహారాతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల నుంచి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు మరియు కౌంటింగ్ హాల్స్ వరకు ప్రోటోకాల్ ప్రకారం అంచెలంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, భయం లేని వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పోలీస్ సిబ్బంది పహారా ఉంటుందని డిజిపి శ్రీ బి శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.


# అంతరాష్ట్ర చైన్ స్నాచర్లు అరెస్టు

- విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు తెలియజేసిన డిసిపి అనురాధ



ఎల్బీనగర్ జనవరి 28 భారత జ్యోతి ప్రతినిధి.
ఢిల్లీలోని ఎన్ సి ఆర్ ప్రాంతంలో ఫుడ్ డెలివరీ బాయిల్ గా పని చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర చైన్స్ స్నాచర్లు మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో పలు పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ కు పాల్పడి ఢిల్లీకి పారిపోయిన చైన్ స్నాచర్లను సిసి ఫుటేజీ ఆధారంగా వారిని అదుపులోకి తీసుకొని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసు కున్న చైతన్యపురి పోలీసులు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి అనురాధ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీ నగర్ ,హయత్ నగర్, చైతన్యపురి ,నాగోల్ పోలీస్ స్టేషన్ పరిదిలో ఒకేరోజు ఇరువురి యువకులు అక్షయ్ కుమార్ శర్మ (29 )రోహిత్ (26) వీధి ఇరువురు అంతరాష్ట్ర చైన్స్ స్నాచర్లు ద్విచక్ర వాహనాన్ని తీసుకుని మూడు పోలీస్ స్టేషన్లో పరిధిలో ఒకేరోజు గంట వ్యవధిలోనే చైన్ స్నాచింగ్ పాల్పడడంతో పాటు గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం చేసి సికింద్రాబాద్ సంగీత థియేటర్ క్రాస్ రోడ్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వదిలేసి ఢిల్లీకి పారిపోయారు. చైన్ స్నాచింగ్ బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని సిసి ఫుటేజ్ ఆధారంగా ఇరువురు అంతరాష్ట్ర యువకులు చైన్ స్నాచింగ్ చేశారని గుర్తించారు. పూర్తి ఆధారాలు సేకరించిన చైతన్యపురి పోలీసులు పది రోజుల వ్యవధిలోనే వీరి ఇరువురిని ఢిల్లీలో అదుపులోకి తీసుకొని ఎల్బీనగర్ కమిషనర్ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఎల్బీనగర్ డిసిపి కాంప్ కార్యాలయంలో మంగళవారం విలేఖరి సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు వెల్లడించారు. ఢిల్లీలో అంతరాష్ట్ర చైన్స్ నాచర్లను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను డిసిపి అనురాధ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో అడిషనల్ డిసిపి కోటేశ్వరరావు, ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, చైతన్యపురి సిఐ సైదులు, డిఐ గురుస్వామి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచుల కృషి ఎంతో అవసరం



మర్రిగూడ జనవరి 27 భారత జ్యోతి: నూతనంగా ఏర్పడిన 18 గ్రామ పంచాయతీల సర్పంచులతో ఎంపీడీవో మునయ్య సమావేశమై వారిని శాల్వాతో సన్మానించారు. ఎంపీడీవో మునయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేయకుండా గ్రామ అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. గ్రామాలలో ప్రజల సమస్యను ఎప్పటికప్పటికీ పరిశీలిస్తూ వారి యొక్క సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ యొక్క బాధ్యతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీ ఓ రవికుమార్, సూపర్ ఇండెంట్ యాకూబ్ వ్యవసాయ సంచాలకులు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు

స్వర్ణ భారత జ్యోతి
తెలుగు దినపత్రిక

బుధవారం
28-01-2026



## మేడారం కోసం మీడియా ఉత్సాహం

● దేశవిదేశాల నుంచి ఫోటోగ్రాఫర్లు, విలేకర్లు రాక



**ములుగు,జనవరి27 :** మేడారం జాతరలో మీడియా మేనేజ్‌మెంట్ అనేది అత్యంత ప్రధానమైనది, కీలకమైనది, సంక్లిష్టమైనది. అయితే సాంకేతికత పెరిగిన కారణంగా మీడియా కవరేజ్ చాలా సులువుగా మారి ంది. ఒక్క సెల్‌ఫోన్‌తో ప్రపంచ వ్యాప్తంగా సమాచారన్ని చేరవేసే అవకాశం రావడంతో జాతరలో ప్రత్యేకతలను విలేకరులు ఎప్పటికప్పుడు తమ కార్యాలయాలకు చేరవేస్తుంటారు. ఇంకా చెప్పాలంటే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు పోటీపడి జాతరను కవర్ చేయడం చూస్తున్నాం. ఈ జాతర జరిగే నాలుగు ర ఓజులే కాకుండా నెల ముందునుంచి తరవాత ఓ పక్షం రోజుల వరకు నిరంతరం ప్రతి సూక్ష్మ అంశాన్ని ప్రజలకు తెలియజేస్తుంటారు. ఈ జాతర కవరేజీకి డీపీఆర్వో కార్యాలయం నుంచే దాదాపు వెయ్యి మీడియా పాస్‌లు జారీచేయడం, దానికితోడు మరో రెండు వందలకు పైగా దేశ, విదేశీ జర్నలిస్టులు కవరేజీ చేసేందుకు చేస్తారు. జాతరపై అధ్యయనం చేసేందుకు, జాతర అంశాలను తమ కెమెరాల్లో బంధించేందుకు ఎంతోమంది ఫోటోగ్రాఫర్లు కూడా వస్తారు. గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలు, మొక్కులు, జాతర జరిగే తీరు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే గిరిజన జాతుల సంస్కృతీ సంప్రదాయాలను తమ కథనాలతో పాటు, ఫోటోల ద్వారా అందించేందుకు ఉత్సాహం చూపుతారు.

## మహజాతరకు ఆర్టీసీ విస్తృతంగా ఏర్పాట్లు

● భక్తుల కోసం 4వేల ప్రత్యేక బస్సుల కేటాయింపు



**ములుగు,జనవరి27 :** మేడారం మహజాతరకు ఆర్టీసీ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి 20 లక్షల మంది భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. 4వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసింది. 10,441 మంది సిబ్బందిని నియమించి సేవలను విస్తృత పరిచేందుకు ఏర్పాట్లు చేసింది. వరంగల్ రీజియన్‌లో 51 పాయింట్లను ఏర్పాటు చేసింది. హన్మకొండలో హయగ్రీవచారి మైదానం, వరంగల్‌లో పండ్ల మార్కెట్‌లో మేడారం బస్సు పాయింట్స్‌ను ఏర్పాటు చేసింది. అలాగే జాతరకు వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ వినూత్న తరహాలో కొత్త స్కీం ప్రవేశ పెట్టింది. 30మంది భక్తులు ఉంటే ఇంటికే ఆర్టీసీ బస్సును పంపిస్తుంది. ఇప్పటికే మేడారం ప్రసాదాన్ని(బెల్లం) భక్తులకు ఇంటికి చేర్చేందుకు ప్రత్యేకంగా కార్గో సర్వీసు ప్రారంభించింది. అలాగే బస్సు సౌకర్యాలు, చార్జీలు, రూట్ మ్యాప్ తదితర వివరాల కోసం ప్రత్యేకంగా మేడారం విత్ ఆర్టీసీ పేరుతో ఓ యాప్‌ను రూపొందించింది. గత జాతరలో 3491 బస్సుల ద్వారా 16.82 లక్షల మంది ప్రయాణికులను చేరవేయగా, ప్రస్తుతం 20లక్షల మంది భక్తులను తరలించనున్నారు. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలతో పాటు హైదరాబాద్ రీజియన్ నుంచి బస్సులను కేటాయించారు. మేడారంలో 50 ఎకరాల్లో తాత్కాలిక బస్టాండ్‌ను ఏర్పాటు చేసి 9 కిలోమీటర్ల పొడవుతో 50క్యూలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకేసారి 20వేల మంది భక్తులకు వసతి కల్పించనున్నారు. ప్రయాణికుల నిరీక్షణ, సిబ్బంది విశ్రాంతి గదులు, నిర్వహణ కార్యకలాపాల కోసం 1.10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. వెయ్యి బస్సుల పార్కింగ్ కోసం మేడారంతో పాటు కామారంలో సౌకర్యాలు కల్పించారు. 7వేల మంది డ్రైవర్లు, 1811 మంది కండక్టర్లు, 759 మంది భద్రతా సిబ్బం ది, 153 మంది అధికారులతో కలిసి మొత్తం 10,441 మంది ఉద్యోగులకు విధులు కేటాయించారు. ట్రాఫిక్ జామ్ లాంటి సమస్యలు ఏర్పడకుండా పెట్రోలింగ్ పార్టీని సైతం నియమించారు.

## జాతరలో మంచినీటి వసతి

● 5,500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు



**ములుగు,జనవరి27 :** మేడారంలో భక్తుల కోసం గ్రామీణ నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ ద్వారా రూ.13.70కోట్ల వ్యయంతో 57రకాల పనులను చేపట్టారు. జాతరలో 5,500 తాత్కాలిక నల్లాలు ఏర్పాటు చేశారు. వీటిలో 517 బ్యాటరీ ఆఫ్ టాప్స్, 47సిస్టెర్న్లు, 312 సిస్టర్న్ టాప్స్, 10 చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. 2024లో 5,222 నల్లాలు ఏర్పాటు చేయగా, ఈసారి 5,500నల్లాలను ఏర్పాటు చేశారు. మేడారం ప్రధాన రహదారి, ఆలయం పరిసరా ప్రాంతాలు, పార్కింగ్ ప్రాంతాలు, వివిధ గ్రామాల నుంచి వచ్చే రహదారులు, చెరువులు, జంపన్నవాగు సమీపంలో మరుగుదొడ్లతో పాటు తాగునీటి సౌకర్యాలు కల్పించారు. జాతరలో మొత్తం 5,700టాయిలెట్లు నిర్మించారు. 285 బ్లాకులుగా ఏర్పాటు చేశారు. వీటిని నిరంతరం శుభ్రం చేసేందుకు 255మంది సిబ్బందిని నియమించారు. అలాగే జాతరలో పారిశుద్ధం కార్యక్రమాల కోసం 5వేల మంది శానిటేషన్ సిబ్బందిని నియమించారు. రోజుకు మూడు షిఫ్టులుగా విభజించి 25సెక్టార్‌లలో పని చేయనున్నారు.

## అందుబాటులో వాట్సాప్ సేవలు

● హెలికాప్టర్ ద్వారా జాయ్ రైడ్




**ములుగు,జనవరి27 :** జాతర సమాచారం కోసం తొలిసారి ప్రభుత్వం వాట్సాప్ సేవలను అం దుబాటులోకి తెచ్చింది. 76589 12300 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపితే రూట్ మ్యా ప్, ట్రాఫిక్ తదితర పూర్తి వివరాలు అం దుతాయి. జాతరలో మొబైల్ నెట్ వర్క్‌కి అంతరాయం కలగకుండా 27శాశ్వత టవర్లు, 33తాత్కాలిక పద్దతిలో టవర్లు, 450వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా 196ట్రాన్స్‌ఫార్మర్లు, 911విద్యుత్ స్థంబాలు, 65.75కి.మీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయగా, 350మంది విద్యుత్ సిబ్బందిని, 28డీజిల్ జనరేటర్లను అందుబాటులో ఉంచారు. జంపన్నవాగు వద్ద భక్తులకు స్నాన ఘట్టాలు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు 119తాత్కాలిక గదులు, స్నానాలకు, తాగు నీటి కోసం బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ (బీవోటీ)లను ఏర్పాటు చేశారు. జంపన్నవాగులోకి లక్నవరం నుంచి నీటిని వదలటంతో పాటు మూడు ఫీట్లకు మించి ప్రవాహం లేకుండా ఇసుక చదును చేశారు. 210మంది గజ ఈతగాళ్లు, 12సింగరేణి రెస్క్యూ బృందాలు, 10 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. 15ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 268÷ర్ ÷ౖటెర్లను అందుబాటులో ఉంచారు. జాతరలో మొత్తం 1,418ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. మేడారం భక్తుల కోసం టూరిజం శాఖ హనుమకొండ నుంచి మేడారం వరకు హెలికాప్టర్ సేవలను ప్రవేశ పెట్టింది. అలాగే జాతరలో జాయ్ రైడ్ కోసం కూడా ఏర్పాట్లు చేసింది.

## ఫీజులపై ఉన్న శ్రద్ధ..విద్యార్థుల రక్షణలో

# విఫలమైన శ్రీచైతన్య స్కూల్

● స్కూల్ ముందు విద్యార్థుల తల్లిదండ్రులు స్టూడెంట్ ఆర్గనేషన్స్ ధర్నా

**ఎల్బీనగర్ జనవరి 28 భారత జ్యోతి ప్రతినిధి.**
మెరుగైన విద్యను అందించడంలో విఫలమవుతున్న శ్రీ చైతన్య స్కూల్ యజమాన్యం విద్యార్థులపై తరగతి గదిలో భవనం పెక్కులు ఊడిపడి గాయాల గురవుతున్న పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ కొత్తపేటలోని శ్రీ చైతన్య స్కూల్ ముందు మంగళవారం విద్యార్థి సంఘ నాయకులు తల్లిదండ్రులు ఆందోళనకు దిగి ధర్నా నిర్వహించారు. కార్పొరేటర్ స్కూల్ అంటూ నిబంధనలకు విరుద్ధంగా వేల కొద్ది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు సంపాదనను అడ్డదారిలో విద్య పేరుతో గుంజుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. శ్రీ చైతన్య స్కూల్లో రెండు నెలల క్రితం ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి పై తరగతి గదిలో పెచ్చులూడి కాలుకు గాయాలైన ఇట్టి విషయాన్ని పాఠశాల యజమాన్యం గోప్యంగా ఉంచారు. సోమవారం కూడా అదే విధంగా పెచ్చులూడి విద్యార్థి పై పడడంతో తీవ్ర గాయాల గురయ్యాడు. విద్యార్థి తల్లిదండ్రులు స్కూల్ కు వచ్చి యజమాన్యాన్ని నిలదీసినప్పటికీ సరైన సమాధానం చెప్పకుండా దాటవేయడంతో ఆగ్రహానికి గురైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన దిగారు. అంతేకాకుండా శ్రీ చైతన్య స్కూల్లో బాత్రూమ్స్ సక్రమంగా లేక దుర్వాసన వెదవెళుతున్నారని పరిశుభ్రతలో స్కూల్ యజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా పాఠశాల యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థులకు రాబోయే రోజుల్లో ఇలాంటి ప్రమాదం జరగకుండా చూడాలని ఉన్నత విద్యాధికారులను విద్యార్థి తల్లిదండ్రులు స్టూడెంట్స్ ఆర్గనేషన్స్ నాయకులు డిమాండ్ చేశారు.



# విద్య ధారణ సమాజంలో మార్పు




**జెక్కిడి రఘువీర్ రెడ్డి.**



**ఎల్బీనగర్ జనవరి 27 స్వర్ణ భారత జ్యోతి.**
సమాజంలో విద్య ద్వారానే మార్పు జరుగుతుందని ఈ మార్పుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని చెన్నగోని స్వామి ఫంక్షన్ హాల్ లో జరిగిన కేసవ కోచింగ్ సెంటర్ వారి 39వ వార్షికోత్సవ వేడుకలలో సతీసమేతంగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ లో చదువుతున్న విద్యార్థులను ఉద్దేశించి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో 10వ తరగతి అనేది అత్యంత కీలకమైన మలుపు అని, ఈ దశలో చేసే కష్టపడి చదువు, చూపే ఏకాగ్రతే వారి భవిష్యత్తును నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, శ్రద్ధతో, క్రమశిక్షణతో చదువుతూ మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు విద్య నేర్పిన గురువులకు గర్వకారణంగా నిలవాలని, అలాగే తమను తీర్చిదిద్దుతున్న కోచింగ్ సెంటర్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించడం జరిగింది. ఈ కార్యక్రమం సందర్భంగా మా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరఫున విద్యార్థుల విద్యా ప్రోత్సాహం కోసం ప్రత్యేకంగా చేయించిన ఆల్ ఇన్ వన్ పుస్తకాలను కోచింగ్ సెంటర్‌లో చదువుతున్న 150 మంది విద్యార్థులకు అందించడం జరిగింది. విద్య ద్వారానే సమాజంలో స్థిరమైన మార్పు సాధ్యమవుతుందన్న నమ్మకంతో ఈ చిన్న ప్రయత్నం చేయగలిగినందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశాను. అలాగే గత 39 సంవత్సరాలుగా నిరంతరంగా నాణ్యమైన విద్య అందిస్తూ, వేలాది మంది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేస్తూ సమాజానికి విలువైన సేవ అందిస్తున్న కేసవ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కేసవ రావు కి,వారి ధర్మపత్నిస్వప్నకి ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేయడం జరిగింది. వారి సేవలు మరెన్నో తరాల విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ వారు, ఇతర అతిథులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, తల్లితండ్రులు, యువత, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# సాధారణ పార్టీ నేతలా చంద్రబాబు





● శిక్షణా తరగతులకు అందిరతో పాటు హాజరు

**అమరావతి,జనవరి27 :** టిడిపి కార్యాలయంలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమయ్యింది. శిక్షణా తరగతులకు హాజరైన పార్టీ అధినేత చంద్రబాబు అందరితో పాటు పాఠాలు విన్నారు. సామాన్య కార్యకర్తలానే సీఎం చంద్రబాబు పార్టీ శిక్షణ తరగతుల్లో కూర్చొని పాఠాలు విన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్లమెంట్ కమిటీ వర్క్‌షాప్‌లో తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పాల్గొన్నారు. వర్క్ షాప్ జరుగుతున్న గదుల్లోకి వెళ్లిన అధినేత.. నేతల మధ్య కూర్చొని శిక్షణ తరగతులను ఫాలో అయ్యారు. నూతనంగా ఎంపికైన పార్లమెంట్ పార్టీ అధ్యక్షులకు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి చంద్రబాబు హాజరయ్యారు. నాయుకులు చెప్పేది శ్రద్ధగా విని.. వర్క్ షాప్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇవాళ ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న మంత్రి నారా లోకేష్.... ప్రతి గదిలోకి వెళ్లి వర్క్ షాప్‌లోని అన్ని బృందాల సభ్యులతో ముచ్చటించారు. 25 పార్లమెంట్ కమిటీల నుంచి 1050 మంది కమిటీ సభ్యులు వర్క్ షాప్‌నకు కు హాజరయ్యారు. నాలుగున్నర దశాబ్దాల పార్టీ ప్రయాణం, పార్టీ భావజాలం, క్యాడర్ మేనేజ్‌మెంట్, కార్యకర్తలు ప్రాధాన్యం వంటి అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్రణాళికలు, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి వంటి అంశాలపై జరిగిన వర్క్‌షాప్‌లో సీఎం పాల్గొన్నారు.

## మేడారంలో ముందస్తు మొక్కులు

● పక్షం రోజులుగా లక్షల్లో భక్తులు రాక

**ములుగు,జనవరి27 :** మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మహా జాతరకు ముందుగా మొక్కులు చెల్లించుకున్నారు. ఎత్తుబంగారం(బెల్లం), పూలు, పండ్లు, చీరె, సారె, కొబ్బ రికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. యాట మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి, కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. ఇప్పటికే లక్షల్లో వచ్చి దర్శించుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాలతో వనదేవతల గద్దెలకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో మేడా రం పరిసరాలన్నీ కిటకిటలాడాయి. గత పక్షం రోజులుగా లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు, పోలీసులు అంచనాలు వేశారు. మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి ముందస్తుగా తరలివస్తున్న భక్తులకు దేవాదాయ శాఖ అధికారులు 24గంటలపాటు సమ్మక్క- సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు దేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేలా ఏర్పాట్లు చేశారు. పగలు భక్తుల రద్దీ అధికంగా ఉంటున్న నేపథ్యంలో గద్దెల గేట్లకు తాళాలు వేస్తున్నారు. రాత్రిళ్లు మాత్రం భక్తుల తాకిడి తక్కువగా ఉంటుండడంతో గేట్లు తీసి నేరుగా తల్లుల గద్దెలను దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ

**ఎస్సై ని కారుతో ఢీకొట్టిన ఇరువురు అరెస్టు.**



**ఇబ్రహీంపట్నం జనవరి 28 భారత జ్యోతి**
డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సైను కారుతో ఢీకొట్టి అలాగే దూసుకెళ్లిన ఇద్దరు యువకులను యాచారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు మంగళవారం తరలిం చారు. రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగర్ రహదారిపై ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. తనిఖీల్లో భాగంగా కారును ఆపేందుకు ప్రయత్నించిన ఎస్సై మధును నిందితులు ఢీకొట్టారు. ఎస్సై కారు బానెట్‌పై పడినప్పటికీ ఆపకుండా సుమారు 700 మీటర్ల వరకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో మరో బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. చివరకు ఎస్సై కారు నుంచి దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనకు కారణమైన కారును ఇబ్రహీంపట్నంలో పోలీసులు పట్టుకున్నారు. కారులో పరిశీలించగా ఒక మద్యం బాటిల్, ఒక కల్లు బాటిల్ లభ్యమయ్యాయి. బ్రీత్ అనలైజర్ పరీక్షలో డ్రైవర్ కీసరి శ్రీకర్ రెడ్డి(27)కి 135 ఎంజీ, మరో యువకుడు పరంద నితిన్(24)కు 122 ఎంజీ ఆల్కహాల్ పాయింట్లు నమోదయ్యాయి. వీరిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు.

## రైతులకు అరకొర సాయం

ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. వరి సాగు చేసే రైతులతో పాటుగా పసుపు, పత్తి, మొక్కజొన్న, అపరాల సాగు చేసే అన్నదాతలంతా బోనస్ ఇవ్వాలన్నారు. సాగులో ఇబ్బందులు, ఇతర పంటల్లో వెలుగు చూసే శ్రమను దృష్టిలో పెట్టుకుని అన్ని పంటలకు క్వింటాకు రూ.500 చొప్పున సాయం అందిస్తే రైతుకు ఉపకారం జరుగుతుందన్నారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు సాగు సుమారుగా 25వేల ఎకరాల నుంచి 30వేల ఎకరాల్లో కొనసాగుతుంది. ఏటా జనవరిలో పసుపు పంట చేతికి వస్తుంది. ఈ సమయంలో పసుపు పంటకు కనీస మద్ధతు ధర దక్కకపోవడంతో రైతన్నలకు నష్టాలు తప్పడం లేదు. పసుపు సాగు చేసే వారికి బోనస్ అందిస్తే రైతులకు ప్రోత్సాహకంగా ఉండటంతో పాటుగా పసుపు సాగు మరింత పెరిగే వీలుందని అన్నదాతలు చెబుతున్నారు.

## మోగిన తెలంగాణ మున్సిపల్ నగారా

అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువుకాగ,ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

## తాను చెబుతున్న మొదటి దెయ్యం అతనే

బీఆర్ఎస్‌లో ఎందరో నేతలతో కన్నీళ్లు పెట్టించిన దుర్మార్గుడు సంతోష్ అని మండిపడ్డారు. ప్రగతి భవన్ గేటు బయట గద్దర్‌ను నిలబెట్టింది, ఈటల బీఆర్ఎస్ సస్పెండ్‌కు కారణం సంతోష్ రావే అని కవిత ఆరోపణలు గుప్పించారు. కేసీఆర్‌ను ఉద్యమకారులకు, పేద ప్రజలకు దూరం చేశారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తికి అనుకూలంగా కేటీఆర్, హరీశ్ రావులు ట్వీట్లు పెట్టడాన్ని బీఆర్ఎస్ క్యాడర్ గమనించుకోవాలని కవిత సూచించారు. బీఆర్ఎస్‌లో అన్ని దుర్మార్గాలకు కారణం సంతోష్ రావేనని ఆరోపించారు. ఎం రేవంత్‌రెడ్డికి సంతోష్‌రావు గూఢచారి. నేను ముందునుంచి చెబుతున్న దెయ్యం ఆయనే. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ సంతోష్‌కు ఎలాంటి శిక్ష విధిస్తుందనేది వేచి చూడాలి. ఆయనకు శిక్ష పడుతుందన్న నమ్మకం నాకు లేదని కవిత వ్యాఖ్యానించారు. గుంపు మేస్త్రీ రేవంత్ తన గూఢాచారిని ఫోన్ ట్యాపింగ్ కేసులో కాపాడుకుంటాడని.. సిట్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్సైజ్ పోలీసులంటే గంజాయి సరఫరాదారులు, స్మగ్లర్లకు భయం లేదని కవిత అన్నారు. ఎక్సైజ్ పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వద్ద ఆయుధాలు ఉంటేనే భయం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందన్నారు.

## తరలింపు కుదరదు

తరలిస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పేరుతో పటాన్‌చెరులోని కర్ధనూర్‌కు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని.. దీన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో తాను మాట్లాడేవరకు తరలింపు ఆలోచన చేయొద్దన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ఇది తన సూచన.. హెచ్చరిక అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సంగారెడ్డిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల తరలింపు విషయంపై జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఆ శాఖ అధికారులపై ఆయన మండిపడ్డారు. అక్కడి డిస్టిక్ట్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 'ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం' పేరుతో పఠాన్‌చెరు నియోజకవర్గం కర్ధనూర్‌కు తరలించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తీవ్రంగా వ్యతిరేకించారు. అవసరమైతే అక్కడ ఉన్న పఠాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పఠాన్‌చెరుకు తీసుకెళ్లవచ్చని సూచించారు. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మాట్లాడే వరకు ఎలాంటి తరలింపు ఆలోచన చేయవద్దన్నారు. ఇది కేవలం సూచన కాదు.. హెచ్చరికగా పరిగణించాలి' అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## అక్రెడిటేషన్ల జీవోను సమూలంగా సవరించాలి

నియోజకవర్గ స్థాయిలో రిపోర్టర్లకు ఇచ్చే కార్డుల విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని, అదే విధంగా ఎంపానల్మెంట్ లేని చిన్న, మధ్య తరహా పత్రికలకు గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఇచ్చినట్లు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని, అదే విధంగా రెగ్యులర్ గా నడుస్తున్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని వారు మంత్రిని, కమీషనర్ ను కోరారు. 'ప్రెస్'స్టిక్కర్ నిబంధన తొలగించాలిఅక్రెడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలకు 'ప్రెస్' అని రాసుకోవాలంటూ జారీ చేసిన సర్క్యులర్ ను రద్దు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య కోరారు. ఈ మేరకు ఆయన, పలువురు ఫెడరేషన్ నాయకులు మంగళవారం సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సర్క్యులర్... జర్నలిస్టులను, జర్నలిజం వృత్తిని అవమానించేదిగా ఉందని, జర్నలిస్టులకు కేవలం సంక్షేమ పథకాల కోసం గుర్తింపు కార్డుగా ఇచ్చే అక్రెడిటేషన్ కార్డును జర్నలిస్టుగా గుర్తించేందుకు ప్రామాణికం చేయడం తగదని, అక్రెడిటేషన్ కార్డు ఉన్న వారే తమ వాహనాలకు "ప్రెస్"అని రాసుకోవాలనే నిబంధన సరైంది కాదని, ఈ సర్క్యులర్ నిబంధన ఇటు జర్నలిస్టుల సమాజానికి,అటు జర్నలిజం వృత్తి స్వేచ్ఛకు భంగం కలుగుతుందని మామిడి సోమయ్య కమీషనర్ తో అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే అక్రెడిటేషన్ కార్డు కలిగి ఉన్న జర్నలిస్టులు మాత్రమే జర్నలిస్టులు కాదని, అక్రెడిటేషన్ కార్డు లేని జర్నలిస్టులు చాలా మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల మంది జర్నలిస్టులు వుండగా, వీరిలో సగం మందికి మాత్రమే ప్రభుత్వం అక్రెడిటేషన్ కార్డులు ఇస్తున్నదని, మిగతా సగం మంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఆర్ ఎన్ ఐ (ప్రస్తుత పీ ఆర్ జీఐ) రిజిస్ట్రేషన్ పొందిన మీడియా సంస్థలు గుర్తింపు కార్డులతో పనిచేస్తున్నారని అన్నారు. ఎంపానల్మెంట్ లేని మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఉండవని, అంత మాత్రాన ఆ జర్నలిస్టులను జర్నలిస్టులే కాదనే విధంగా తమ వాహనాలకు ప్రెస్ స్టిక్కర్ పెట్టుకోవద్దంటూ ప్రభుత్వం నిబంధనలు విధించడం సరైంది కాదని అన్నారు. సమాజంలో నకిలీ జర్నలిస్టులను కట్టడి చేయడానికి అనేక మార్గాలున్నాయని, ప్రత్యేక రూల్స్ ద్వారా నియంత్రించవచ్చని, అలాంటి చర్యలకు తామేమీ వ్యతిరేకం కాదని, కానీ ఆ పేరుతో అసలైన జర్నలిస్టులను అవమానించడం, అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికే అక్రెడిటేషన్ కార్డు లేని అనేక మంది జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో తమరు జారీ చేసిన సర్క్యులర్ "మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు"గా అంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సర్క్యులర్ నిబంధన ను వెంటనే ఉపసంహరించాలని మామిడి సోమయ్య కోరారు. దీనిపై పునరాలోచన చేస్తామని, రవాణాశాఖ అధికారులతో చర్చిస్తానని కమీషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు.

# పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ముమ్మాటికీ నిజం

- **మెగాస్టార్ వ్యాఖ్యలతో విభేదించిన గాయని చన్మయి శ్రీపాద**



చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవని చిరంజీవి చేసిన కామెంట్స్‌తో గాయని చన్మయి శ్రీపాద విభేదించారు. ఇవి లేకుండా సినీ పరిశ్రమ లేదని ఖరాఖండిగా చెప్పారు. సినిమాలో అవకాశం కావాటంలే.. లొంగిపోవాలన్నది నిజమని చెప్పారు. పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని ఆమె అన్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఎక్స్ వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇండస్ట్రీలో నిబద్ధత అనే పదానికి పూర్తి భిన్నమైన అర్థం ఉందని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎక్కువగా ఉంది. కమిట్‌మెంట్ ఇవ్వకపోతే కొత్త వారికి అవకాశాలు రావు. సాధారణంగా కమిట్‌మెంట్ అంటే వృత్తిపరమైన నిబద్ధత అనే అర్థం. కానీ, ఇండస్ట్రీలో మాత్రం దాని అర్థం వేరు. కొందరు పురుషులు ఈ పదాన్ని ఉపయోగించి మహిళల నుంచి ఏవేవో ఆశిస్తారు. గతంలో ఓ ప్రముఖ సింగర్ ఇండస్ట్రీలో ఎదురైన చేదు అనుభవాలకు భయపడి ఈ రంగాన్నే వదిలివెళ్లిపోయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంతోమంది ఇక్కడ వేదికలపై స్పీచ్‌లు ఇస్తూనే ఉన్నారని చిన్మయి తెలిపారు. తాను కూడా గతంలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. తన తల్లి సమక్షంలోనే ఎంతో నమ్మిన ఒక పెద్దాయన తనతో తప్పుగా ప్రవర్తించాడని అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి ఓ లెజెండ్ అని ఆమె అన్నారు. ఆయన తరంలో నటీనటులంతా ఒకరితో ఒకరు స్నేహభావంతో ఉండేవారని.. పరస్పరం గౌరవించుకునే వారని చెప్పారు. లెజెండ్‌లతో కలిసి వర్క్ చేసిన వారు కూడా తన దృష్టిలో గొప్పవారేనని చిన్మయి తెలిపారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' సక్సెస్ మీట్‌లో చిరంజీవి ఇండస్ట్రీ గురించి మాట్లాడారు. 'సినీ ఇండస్ట్రీ అద్దం లాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితమే వస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలి. ఇది గొప్ప ఇండస్ట్రీ. 'ఇక్కడ నెగెటివ్ పీపుల్ ఉంటారు. చేదు అనుభవాలు ఎదురవుతాయి' అనుకుంటే అది నీ తప్పిదం. నువ్వు నిక్కచ్చిగా ఉంటే ఎవరూ అవకాశం తీసుకోరు. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు . నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది'అనిఆయన అన్నారు. చిరంజీవి వ్యాఖ్యలతో చిన్మయి విభేదించారు.

# ఎన్టీఆర్ అభిమానులకు పండగవార్త




### మేలో దేవర-2 షూటింగ్ మొదలు

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'కు సీక్వెల్‌పై అప్డేట్ వచ్చింది. 2024లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మంచి ఆదరణను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత దీనిపై పెద్దగా అప్‌డేట్స్ రాకపోవడంతో నెట్టింట రకరకాల వార్తలు ప్రచారమయ్యాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత సుధాకర్ ఓ కార్యక్రమంలో 'దేవర 2'అప్‌డేట్ పంచుకున్నారు. ఈ ఏడాది మేలో దీని సీక్వెల్ పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదిలో సినిమాను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీంతో అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 'దేవర' విడుదలై ఏడాదైన సందర్భంగా గతేడాది సెప్టెంబర్‌లో నిర్మాణసంస్థ ఈ సీక్వెల్‌పై ఓ పోస్ట్ పెట్టింది. 'ప్రపంచం ఎప్పటికీ గుర్తుపెట్టుకునే పేరు ఇది. తాను పంచిన ప్రేమ, తాను చూపిన భయం.. ఎప్పటికీ మర్చిపోలేరు. 'దేవర 2' కోసం అందరూ సిద్ధంగా ఉండండి' అని పేర్కొంది.'దేవర 2'పై కొరటాల గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో మాట్లాడి అంచనాలు పెంచేశారు. మొదటిభాగం కంటే రెండో భాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఆయన వెల్లడించారు. పార్ట్-1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు


# ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి క్రేజీ అప్‌డేట్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా డబ్బింగ్ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత పవన్ కళ్యాణ్ , హరీష్ శంకర్ దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా హరీష్ శంకర్ రాసిన పవర్‌ఫుల్ డైలాగులకు పవన్ తనదైన శైలిలో గొంతును అందించబోతుండటం హైలైట్‌గా మారనుంది. ఇక తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని మార్చి 26న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్ నడుస్తుంది. వాస్తవానికి ఆ తేదీన విడుదల కావాల్సిన రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం వాయిదా పడటంతో, ఆ స్థానాన్ని 'ఉస్తాద్ భగత్ సింగ్' భర్తీ చేయనున్నట్లు సమాచారం. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'ఈసారి పర్ఫార్మెన్స్ బద్ధలైపోద్ది' అంటూ ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమా రేంజ్‌ను చెప్పకనే చెప్పగా, ఇప్పుడు డబ్బింగ్ పనులు మొదలవ్వడం సినిమా విడుదలకు అడుగులు వేగంగా పడుతున్నాయనే సంకేతాలను ఇస్తోంది.


# జననాయగన్‌కు మరోమారు చుక్కెదురు

### సింగిల్ బెంచ్ తీర్పును పక్కన పెట్టిన హైకోర్టు



విజయ్ కథానాయకుడిగా హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపొందిన 'జన నాయగన్'కు మరోసారి చుక్కెదురైంది. 'జన నాయగన్' యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తీర్పును మద్రాసు హైకోర్టు మంగళవారం పక్కనపెట్టింది. మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని తిరిగి సింగిల్ బెంచ్‌ను ఆదేశించింది. సెన్సార్ బోర్డుకు తన వాదనలు వినిపించడానికి న్యాయపరమైన అవకాశాలు ఇవ్వాలని మద్రాసు హైకోర్టు పేర్కొంది. అలాగే, ఈ వ్యవహారాన్ని రివైజింగ్ కమిటీకి పంపిన నిర్ణయం సరైనదా కాదా.. అనే అంశాన్ని సింగిల్ జడ్జి స్వేచ్ఛగా పరిశీలించి నిర్ణయం తీసుకోవచ్చని హైకోర్టు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తగినవిధంగా మరోసారి విచారణ చేసి ఆదేశాలు జారీ చేసే అధికారం సింగిల్ బెంచ్‌కు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జన నాయగన్‌కు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు జనవరి 9న మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీని విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. జనవరి 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని నేడు సింగిల్ బెంచ్‌ను ఆదేశించింది.

# రణబాలిలో ఎఐ ఉపయోగించలేదు




విజయ్ దేవరకొండ కథానాయకుడిగా దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రాబోతున్న 'రణబాలి' టైటిల్ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదలైన ఈ వీడియోలోని అద్భుతమైన విజువల్స్ చూసి, ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో రూపొందించినదని పలు జర్నలిస్ట్‌లతో పాటు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఈ వార్తలపై దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ స్పందిస్తూ.. 'రణబాలి' గ్లింప్స్‌లో ఎక్కడా ఒఎ వాడలేదని స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఇందులోని ప్రతి ఫ్రేమ్‌ను సాంకేతిక బృందం ఎంతో కష్టపడి సంప్రదాయ పద్ధతుల్లోనే డిజైన్ చేసిందని, కేవలం ఈ చిన్న వీడియో కోసమే తమ టీమ్ కొన్ని నెలల పాటు శ్రమించిందని ఆయన వెల్లడించారు. 'టాక్సీవాలా' తర్వాత రాహుల్ దర్శకత్వంలో వస్తున్న ఈ పీరియడ్ డ్రామా 1854 -1878 మధ్య బ్రిటిష్ పాలన కాలం నాటి వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతోంది. రష్మిక మందన్న 'జయమ్మ' పాత్రలో నటిస్తుండగా, అజయ్-అతుల్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. విజయ్ దేవరకొండను ఒక వీరుడిలా చూపిస్తూ భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న విడుదల కానుంది.

# విలనిజం పండించాలనుందన్న తరుణ్ భాస్కర్

### ఓంశాంతితో కల నెరవేరిందన్న ఈశా రెబ్బా






ప్రతినాయకుడిగానూ సత్తాచాటాలని ఉందని నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ అన్నారు. నటుడిగా కంటే డైరెక్టర్‌గా ఉండడమే తనకు ఇష్టమన్నారు తరుణ్ భాస్కర్. కానీ, జీవితంలో ఒక్కసారైనా పూర్తి నెగెటివ్ రోల్‌లో నటించాలనే కోరిక ఉందన్నారు. ఆయన, ఈషారెబ్బా జంటగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఎ.ఆర్. సజీవ్ దర్శకుడు. మళయాల మూవీ 'జయ జయ జయ జయహే' కి రీమేక్‌గా రూపొందిన ఈ సినిమా జనవరి 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తరుణ్ ఆసక్తికర సమాధానాలు చెప్పారు. ఇకపోతే ఎప్పట్నుంచో తాను ఎదురు చూస్తున్న పాత్ర ఈ సినిమాతో దొరికిందని, దాంతో ఇందులోని శాంతి పాత్రని వందశాతం మనసుపెట్టి చేశానన్నారు ఈషారెబ్బా. స్వతహాగా తనకు యాక్షన్ ప్రధానమైన సినిమాలంటే ఇష్టమనీ, ఈ సినిమాలోని యాక్షన్ కోణం కూడా తనకు ఎంతో తృప్తినిచ్చిందన్నారు. అచ్చ తెలుగు కథానాయికైన ఈషారెబ్బా 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంలో నటించారు. ఇందులో తరుణ్‌భాస్కర్ కథానాయకుడు. మంచి కథతో రూపొందిన సినిమా ఇది. అబ్బాయిలు, అమ్మాయిలు... అందరూ కనెక్ట్ అయ్యే బలమైన కథ. ఆలోచన రేకెత్తించే సందేశం ఉన్నా, అది కూడా హాస్యకోణంలోనే ఉండటం ఈ సినిమా ప్రత్యేకత. నేను శాంతి అనే యువతిగా కనిపిస్తా. కరోనా సమయంలో నేను నేర్చుకున్న మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఈ పాత్రకి బాగా పనికొచ్చిందన్నారు. గోదావరి నేపథ్యంలో సాగే ఈ కథలో పాత్రలన్నీ ఆ యాసలో మాట్లాడుతుంటాయి. నేను పుట్టి పెరిగింది తెలంగాణలో అయినా, మా అమ్మ తరపు బంధువులంతా రాజమండ్రికి చెందినవారే. అక్కడికి పండగలప్పుడు వెళ్లి వచ్చేదాన్ని. దాంతో నాకు ఆ యాస మాట్లాడటం పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. తరుణ్‌భాస్కర్ మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుని డబ్బింగ్ చెప్పారు. సినిమాలో చెంపదెబ్బకు సంబంధించిన సన్నివేశాలు చాలానే ఉంటాయని ముందే తెలుసు. అయితే చట్నీ అంటిన చేత్తో కొట్టే సన్నివేశంలో నిజంగానే గట్టిగా కొట్టారు తరుణ్ భాస్కర్. సన్నివేశం పండాలని, చట్నీ ముఖానికి అంటుకోవాలని దర్శకుడు నిజంగానే కొట్టమన్నారట. ఆ సన్నివేశంలో కనిపించే నా కన్నీళ్లు నిజమైనవే. సన్నివేశం పూర్తయ్యాక నిజంగానే ఏడ్చేశానన్నారు.

Published & Owner, Editor ch. Jangaiah.printing at Swarnalatha Bharatha jyothi printers, Office AdressH.No. 7-2-86/3/4.Malikarjuna ngar.Bairamalguda.Sagar Ring Road.L.B. Nagar. telangana. RNI No.APTEL/2007/20124, cell :9666282126, Email : swarnabharathajyothi 2024@gmail.com, Websit : www.swarnabharathajyothi. Com